ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
1
కర్ణాటక వార్తలు
శుక్రవారం 26 సెప్టెంబరు 2025



# రాచనగరి సొగసు.. చూసొద్దాం రండి..!

● అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



వైష్ణవి అలంకరణలో చాముండీ దేవి

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాచనగరి మైసూరులో దసరా వేళ సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు అలరిస్తున్నాయి. దసరా అంటే కేవలం జంబూసవారి, ప్యాలెస్ వీక్షణ మాత్రమే కాదు... ఎన్నో రకాల కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దసరావేళ మైసూరుకు విచ్చేసేవారికి చుట్టుపక్కల సందర్శించేందుకు ఎన్నో ప్రాంతాలు ఉన్నాయి. ఇక్కడి సంస్కృతి, కళలు, సాహిత్యం గురించి తెలుసుకోవచ్చు.

● దసరాలో ప్రత్యేకించి నాడదేవత చాముండేశ్వరీదేవికి ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, పూజలు కొనసాగుతాయి. మరోవైపు ప్యాలెస్‌లోనూ పలు ధార్మిక కార్యక్రమాలు, యువరాజు యదువీర్‌చే ప్రైవేట్ దర్బార్ ఉంటుంది. దర్బార్ అనేది రాజరిక సంప్రదాయంలో ఒకటి. ఆయన ఆశీనులయ్యే సింహాసనం వజ్రఖచిత బంగారు ఆభరణాలతో కూడినది. ఈ సింహాసనం కేవలం దసరా వేళ మాత్రమే వీక్షించే అవకాశం ఉంటుంది. దసరా అనంతరం సింహాసనాన్ని విడిభాగాలుగా చేసి ప్రత్యేకంగా భద్రపరుస్తారు.

● ఈసారి దసరా ఉత్సవాల్లో క్రీడా పోటీలు, ఫ్లవర్‌షో, ఆహార మేళాతోపాటు ఎయిర్‌షో నిర్వహణకు అవకాశం కల్పించారు. మైసూరు ప్యాలెస్‌తోపాటు పలు కీలకమైన కూడళ్లను, ప్రధానవీధులను విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. రాత్రివేళ మైసూరు ప్యాలెస్ వద్ద రెండు గంటలపాటు లేజర్ షో నిర్వహిస్తున్నారు.

### ఎటు చూసినా దీపాలంకరణ

మైసూరు నగరంలో స్వచ్ఛత పాటించడంతోపాటు దసరావేళ ప్రముఖ రహదారులు, కూడళ్లు అన్నీ విద్యుద్దీపాలంకరణతో జిగేల్ అనిపించేలా ఉన్నాయి. అంబావిలాస్ ప్యాలెస్, కేఆర్ సర్కిల్ తదితర ప్రాంతాలన్నీ విద్యుద్దీపాల శోభను సంతరించుకున్నాయి.

### కవితా గోష్ఠులు

సాహితీవేత్తలను ప్రోత్సహించేలా కవితాగోష్ఠులు సాగుతున్నాయి. ప్రభాత కవిగోష్ఠి, ప్రచుర కవిగోష్ఠి, ప్రజ్వల కవితా గోష్ఠి, ప్రతిభా కవితా గోష్ఠి పేరిట కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వందమందికిపైగా కవులు, సాహితీవేత్తలు పాల్గొని తమ కవితలను వినిపిస్తారు. రామగోవింద రంగ మందిరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కిరు రంగ మందిర వేదికపైనా సాంస్కృతిక సందడి సాగుతోంది. పురభవన (టౌన్‌హాల్)లోనూ ప్రదర్శనలు ఉన్నాయి. శ్రీకంఠేశ్వర ఆలయం, చిక్కగడియార స్టేజ్, నాదబ్రహ్మసంగీత సభ వేదికపైనా, జ్ఞానభారతి, కర్ణాటక కళామందిరలోనూ జగన్‌మోహన్ ప్యాలెస్‌లోనూ సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షించవచ్చు. మహిళలు, పిల్లలకోసం ప్రత్యేక దసరా ఉత్సవాలుగా నిర్వహిస్తున్నారు.

### మైలారి దోశ

మైసూరు నగరంలో మైసూరు పాక్ మాత్రమే కాకుండా పలు రకాల తినుబండారాలకు ప్రత్యేకత ఉంది. ఇక్కడ మైసూరు 'మైలారి దోశ' ఎంతో ఫేమస్. నజర్‌బాద్‌లో మైసూరు మైలారి దోసె తయారు చేస్తారు. ఇక్కడి దోసె రుచి నోరూరించేలా ఉంటుందనడంలో సందేహం లేదు. కాగా మైసూరుపాక్ రాష్ట్ర ప్రజల మిఠాయిలలో ఒకటిగా ఉంది. మైసూరు రాజప్రాసాదంలో ఆవిర్భవించిన మైసూరుపాక్‌ను అన్ని పండుగలు, పర్వదినాల వేళ ఇచ్చిపుచ్చుకుంటారు.

### హనుమంతు పలావ్...

మాంసాహార ప్రియులకు ఫేవరెట్‌గా ఉన్న మైసూరు నగరంలోని హనుమంతు పలావ్ ఎంతో పేరొందింది. మండిమొహల్లా వైపు వెళ్తే హనుమంతు పలావ్‌ను ఆస్వాదించవచ్చు. సినిమా తారలు, క్రికెటర్‌లు అప్పుడప్పుడు ఈ హోటల్‌ను సందర్శిస్తుంటారంటే ఎంతగా పేరొందిందో అర్థం చేసుకోవచ్చు.

### మైసూరు చుట్టుపక్కల చూడదగిన ప్రాంతాలు

చాముండి కొండపై కొలువైన చాముండేశ్వరీదేవిని దర్శించుకోవచ్చు. మైసూరు నగరం బస్టాండ్ నుంచి 12.5 కిలోమీటర్ల దూరంలో కొండ ఉంది. ప్రతి అరగంటకో బస్సు సదుపాయం ఉంది. కాగా రైల్వే మ్యూజియం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా ఉంది. మైసూరు రైల్వేస్టేషన్ పక్కనే మ్యూజియం ఉంది. వింటేజ్ రైళ్లు, బోగీలు, భారతీయ రైల్వేను ప్రతిబింబించే ఫొటోలు, రైల్వే ఉపకరణాలను ఇక్కడ వీక్షించవచ్చు. మైసూరు నుంచి సుమారు 30 కిలోమీటర్ల దూరంలో సోమనాథపుర దేవాలయం ఉంది. హొయ్సళ కాలంలో 1268లో ఆలయాన్ని నిర్మించారు. యునెస్కో వారసత్వ జాబితాలో చేర్చింది. మైసూరులోని సబర్బన్ బస్టాండ్ నుంచి బస్సు సదుపాయాలు ఉన్నాయి. పురాతన శివాలయాలలో ఒకటైన నంజన్‌గూడులోని శ్రీకంఠేశ్వర ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. మైసూరు నుంచి 24 కిలోమీటర్ల దూరంలో నంజన్‌గూడు ఉంది. కావేరి నదికి అనుబంధంగా నిర్మించిన కేఆర్‌ఎస్ డ్యాం మైసూరు నుంచి 23 కిలోమీటర్ల దూరంలో ఉంది. కావేరి బ్యాక్‌వాటర్, బృందావన్ గార్డెన్‌ను వీక్షించవచ్చు. ఇలా మైసూరు నగరానికి వెళ్తే చుట్టుపక్కల ప్రముఖప్రాంతాలను తక్కువసమయంలో వీక్షించే అవకాశం ఉంది.

### 27న ఎయిర్‌షో



ఎయిర్‌షోకు సారంగ్ హెలీక్యాప్టర్ల రిహార్సల్స్

నగరంలోని బన్నిమండప మైదానంలో దసరా ఉత్సవాలలో భాగంగా 27, అక్టోబరు 1వ తేదీలలో ఎయిర్‌షో నిర్వహించనున్నారు. ఇందుకుగాను గురువారం రిహార్సల్స్ సాగాయి. 27న శనివారం సాయంత్రం 4 గంటలకు హెచ్‌ఏఎల్‌కు చెందిన సారంగ్, ధ్రువ్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్‌లు, సూర్యకిరణ్ (ఏరోబాటిక్ టీమ్), ఇంకా హాక్ ఎంకే 132 జెట్ విమానాలు ఆకాశంలో సందడి చేయనున్నాయి. మైదానంలోకి టిక్కెట్ హోల్డర్‌లకు మాత్రమే ప్రవేశం కల్పించనున్నారు. కాగా 28, 29 తేదీలలో డ్రోన్‌షో ఉంటుంది. చాముండేశ్వరి ఎలక్ట్రిసిటీ సప్లయ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 28, 29 తేదీలలో సాయంత్రం 6 గంటలకు డ్రోన్‌షో జరగనుంది.




విద్యుద్దీపాల అలంకరణలో మైసూరు పురవీధులు



జిగేల్ అంటున్న మైసూరు ప్యాలెస్



సాంస్కృతిక ప్రదర్శన



కేఆర్ సర్కిల్‌లో విద్యుద్దీపాల అలంకరణ



బంగారుసింహాసనంపై యువరాజు యదువీర్

## కులగణనకు బీసీ వర్గాల మద్దతు

● సర్వేని విజయవంతం చేయాలని పిలుపు



సమావేశంలో మంత్రి బోసరాజు, మాజీ సీఎం వీరప్పమొయిలీ తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధంగా సామాజిక, విద్య సమీక్ష (కులగణన)కు, ముఖ్యమంత్రికి మద్దతు ఇచ్చేలా బీసీ వర్గాల సమావేశంలో ముఖ్యులు తీర్మానించారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వెనుకబడిన వర్గాల ప్రముఖుల సమావేశం గురువారం ఒక హోటల్‌లో జరిగింది. చిన్ననీటి పారుదలశాఖ మంత్రి బోసరాజు మీడియాతో మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య సమీక్షలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ సీఎం వీరప్పమొయిలీ మాట్లాడుతూ గురువారం గొప్ప చారిత్రాత్మక సమావేశం జరిగిందన్నారు. ఈ సభ ఇప్పటికే జరపాల్సి ఉండేదని, బీసీ వర్గాల నాయకులంతా పాల్గొన్నారన్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు సమానతపై అవగాహన ఉందని, కాంతరాజ్ కమిషన్ నివేదికపై అభ్యంతరాలు రావడంతో కొత్తగా సర్వేకు సిద్ధం కాగా అందుకు కూడా వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బీకే హరిప్రసాద్, మంత్రులు సంతోష్‌లాడ్, మధుబంగారప్ప, భైరతి సురేశ్ పాల్గొన్నారు.

## భార్యపై అనుమానంతో బిడ్డల హత్య

● ఇద్దరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం



ముగ్గురి పిల్లలతో భార్యాభర్తలు (ఫైల్)

రాయచూరు సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): యాదగిరి జిల్లా సరిహద్దు హత్తికుణి గ్రామం దుగనూర్ హట్టిలో భార్య జయమ్మ(28)పై అనుమానం పెంచుకున్న భర్త అతి కిరాతకంగా తన కన్న బిడ్డలనే నరికి చంపేశాడు. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. హత్తికుణి గ్రామానికి చెందిన శరణప్పకు ముగ్గురు పిల్లలు కాగా ఇటీవల భార్యతో గొడవపడగా ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం 9 ఏళ్ల పెద్ద కూతురుతో కలిసి వెళ్లి భార్యను తీసుకొచ్చిన శరణప్ప బుధవారం రాత్రి నిద్రించిన అనంతరం తెల్లవారుజామున భార్య బహిర్భూమికి వెళ్లిన సమయంలో కొడవలితో ముగ్గురు పిల్లలు సాన్వి(5), భార్గవ్(3)పై ఘాతుకానికి తెగబడ్డాడు. ఇద్దరు పిల్లలు అక్కడికక్కడే చనిపోగా కుమారుడు హేమంత్(8) పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. నిందితుడు పరారీ కాగా అతడికోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. యాదగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఘటనా స్థలాన్ని యాదగిరి ఎస్పీ పృథ్విక్ శంకర్, డీఎస్పీ సురేశ్ నాయక్, ఎస్ఐ హనుమంత బంకలగి పరిశీలించారు.



చిన్నారుల మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

## రాష్ట్రంలో 9వేల ఆర్టీఈ సీట్లు ఖాళీ

● 2,191 మందికి సీటు లభించినా చేరని వైనం



బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఆర్టీఈ (నిర్బంధ విద్య)కు రానురాను డిమాండ్ తగ్గుతోంది. 6-14 ఏళ్లలోపు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి ప్రైవేట్ పాఠశాలల్లో కనీసం 25శాతం కోటా ఇవ్వాలని రైట్ టు ఎడ్యుకేషన్ (ఆర్టీఈ)ని ప్రవేశపెట్టింది. ఈ సంవత్సరం ఒకటో తరగతిలో ప్రవేశానికి 5 సంవత్సరాల 5 నెలలు నిండి ఉంటే అడ్మిషన్లకు అవకాశం కల్పించారు. 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థలలో మొత్తం 11,454 సీట్లను నిర్ణయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రక్రియ ముగిశాక కేవలం 2,499 సీట్లు మాత్రమే బర్తీ అయ్యాయి. 8,955 సీట్లు మిగిలిపోయాయి.

రాష్ట్రంలో మొత్తం 35 జిల్లాలు ఉండగా అందులో 11,454 సీట్లను రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీఈ కోటాగా నిర్ణయించింది. మొదటి విడత ఎంపికలో 3,769 మంది సీటు దక్కించుకున్నారు. రెండో విడతలో 921 చేరి మొత్తం 4,690 మంది అడ్మిషన్ అయ్యారు. అడ్మిషన్లు పొందిన వీరిలో తొలివిడతలో 2,105 మంది, రెండో విడతలో 394 మంది చేరి మొత్తం 2,499 మంది మాత్రమే స్కూళ్లలో చేరారు. ఇక మిగిలిన వారికి సీటు లభించినా ఇంకా 2,191 మంది ఆర్టీఈ కోటాలో నమోదు చేసుకోలేదు.

### 27 జిల్లాల్లో రెండంకెలు దాటలేదు...

రాష్ట్రంలో 35 విద్యాజిల్లాలపైకి మొత్తం 27 జిల్లాల్లో ఆర్టీఈ అడ్మిషన్లు రెండంకెలు దాటలేదు. రాష్ట్రంలోని మధుగిరి, దక్షిణకన్నడ జిల్లాల్లో ఆర్టీఈలో ఒకరు కూడా అడ్మిషన్ పొందలేదు. అయితే బాగల్కోటెలో 368, దావణగెరెలో 294, చిక్కోడిలో 258, మైసూరులో 238 సీట్లు భర్తీ అయ్యాయి. విజయపురలో 139, కలబురగిలో 128, బెళగావి జిల్లాలో కేవలం 125 సీట్లు భర్తీ అయ్యాయి.

## వీరవనితల సాహసాలు యువతకు ఆదర్శం

● ఎంపీ జగశ్ శెట్టర్

బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వీరవనిత కిత్తూరు రాణి చన్నమ్మ, వీరరాణి అబ్బక్క వంటి వారి సాహసాలు నేటి యువతకు ఆదర్శమని బెళగావి ఎంపీ జగదీశ్ శెట్టర్ అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో రాణి చన్నమ్మ 200వ విజయోత్సవం, వీరరాణి అబ్బక్క 500వ జయంతిని కేఎల్ఈ లింగరాజు కళాశాల మైదానంలో నిర్వహించారు. ముగింపు కార్యక్రమం రథయాత్రలో భాగంగా గురువారం ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. శతాబ్దాలక్రితమే రాణులు సైతం తమ శౌర్యప్రతాపాలను చాటారన్నారు. ప్రత్యేకించి యువతలు సమాజంలోని నేటి పరిస్థితులను ఎదుర్కొనాలంటే ఎంతో ధైర్యసాహసాలు, సమయస్ఫూర్తి అవసరమన్నారు. అంతకుముందు సాహితీవేత్త ఎస్ఎల్ భైరప్ప చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో పరిషత్ మాజీ చీఫ్ విప్ మహంతేశ్ కవటిగమఠ, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద హరాసూర, కార్యదర్శి సబేన కొళగేరి, రోహిత ఉమనాబాదిమఠ, హణమంత బగలి, అభిషేక్ హావేరి, నిధి త్రిపాఠి, ఏబీవీపీ సభ్యులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.




వేదికపై జగదీశ్ శెట్టర్ తదితరులు

### జీబీఏ పేరు మార్చండి

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ బెంగళూరు అథారిటీ (జీబీఏ) పేరు మార్చాలని కన్నడ అభివృద్ధి ప్రాధికార అధ్యక్షుడు డాక్టర్ పురుషోత్తమ బిళిమలె డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రేటర్ బెంగళూరు ప్రాధికార పేరుకు ప్రత్యామ్నాయంగా కన్నడ పదాలను సూచించాలని ప్రజలకు డీసీఎం డీకే శివకుమార్ పిలుపునివ్వడం స్వాగతించతగ్గ విషయమన్నారు. ఈ మేరకు డీకే శివకుమార్‌కు లేఖ రాశామన్నారు. పేరులో కన్నడ అస్తిత్వాన్ని సమర్థవంతంగా ప్రతిబింబించేలా బృహత్ బెంగళూరు ప్రాధికార ఏర్పాటు చేయడం సమంజసమని అభిప్రాయపడ్డారు. కాగా ప్రాధికారకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయని మేయర్, ఉపమేయర్‌లు కూడా కన్నడిగులు ఎన్నిక కావాలన్నారు.

### ఇండోర్ విమానాశ్రయంలో బెంగళూరు ప్రయాణికుడికి ఎలుక తంటా

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లోని దేవి అహల్యాబాయి హోల్కర్ విమానాశ్రయంలో బెంగళూరు ప్రయాణికుడు ఒకరికి ఎలుక కరిచింది. మంగళవారం చోటు చేసుకున్న ఘటనలో ప్రయాణికుడికి ఇంజెక్షన్, యాంటిబయాటిక్స్ ఇచ్చినట్టు విమానాశ్రయ డైరెక్టర్ విపిన్‌కాంత్ సేఠ్ మీడియాకు వివరించారు. ఘటన నేపథ్యంలో విమానాశ్రయంలో పెస్ట్ కంట్రోల్ చర్యలు మరోసారి చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.



విద్యారణ్యపురలోని కాళికా దుర్గాపరమేశ్వరి అమ్మవారికి కౌమారి అలంకరణ

## ట్రాఫిక్ సిగ్నల్స్‌కు రూ.56.45 కోట్లు

● కేబినెట్ ఆమోదం

బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ కోసం అవసరమైన రూ.56.45కోట్లు అంచనా ఖర్చుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య అధ్యక్షతన గురువారం మంత్రివర్గ సమావేశం జరిగింది. అనంతరం శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరాలు వెల్లడించారు. రాష్ట్ర సివిల్ సేవలు (పదోన్నతి కోసం తప్పనిసరి తర్ఫీదు) నియమాలు 2025కు మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఉన్నత విద్యాశాఖ పరిధిలోని సమగ్ర విశ్వవిద్యాలయాలు, కళాశాలల నిర్వహణ 2.0 వెర్షన్‌ను అభివృద్ధి చేసేందుకు రూ.40.29 కోట్లు అవసరంగా గుర్తించి కేబినెట్ అంగీకారం తెలిపిందన్నారు. కర్ణాటక కౌశల్య అభివృద్ధి నీతి 2025కి ఆమోదం లభించిందన్నారు. కలబురగి జిల్లా సేడం పురసభను నగరసభగా అప్‌గ్రేడ్ చేసేందుకు అంగీకారం లభించిందన్నారు. కొడగు జిల్లా విరాజ్‌పేటలో ప్రస్తుతం ఉన్న 60 పడకల సామర్థ్యం ఆసుపత్రిని తొలివిడతలో 250 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు రూ.95.60 కోట్లు అంచనాతో అప్‌గ్రేడ్ చేయదలిచామన్నారు. కేంద్రప్రభుత్వ 15వ ఫైనాన్స్ కమిషన్‌లో భాగంగా రాష్ట్ర అగ్నిమాపక, అత్యవసర శాఖల విస్తరణ, ఆధునీకరణకు రూ.329 కోట్లు అంచనాతో పాలనాపరమైన ఆమోదం దక్కిందన్నారు.

## స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలి

● కెనరా బ్యాంకు సీఎండీ సత్యనారాయణరాజు



బనశంకరి బీడీఏ కాంప్లెక్స్ వద్ద పౌరకార్మికులకు ఆరోగ్య కిట్లను పంపిణీ చేస్తున్న సత్యనారాయణ రాజు

బెంగళూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): చుట్టుపక్కల ప్రాంతాలను స్వచ్ఛంగా ఉంచుకోవడం ద్వారా ఉత్తమ ఆరోగ్యం సాధ్యమని, ఇందుకు ప్రజల సహకారం అవసరమని కెనరాబ్యాంకు ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సత్యనారాయణరాజు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా పిలుపు నేపథ్యంలో గురువారం రెండు వేర్వేరు ప్రాంతాలలో శ్రమదానం చేశారు. బనశంకరి బీడీఏ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఏర్పాటైన కార్యక్రమంలో నగర పరిధిలోని ప్రధాన కార్యాలయంతోపాటు బ్యాంకు శాఖల ఉద్యోగులు 250మందికిపైగా పాల్గొన్నారు. సీఎండీ మాట్లాడుతూ ప్రధానమంత్రి పిలుపుతో సమాజంలో చైతన్యం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆర్థిక పురోగతితోపాటు ఆరోగ్యకరమైన సమాజం ముఖ్యమన్నారు. బనశంకరిలో బహుళ సముదాయంతోపాటు ఆ ప్రాంతమంతా ఉద్యోగులు శ్రమదానంలో భాగస్వాములయ్యారు. ఇదే సందర్భంగా పౌరకార్మికులకు ఆరోగ్య కిట్‌లను పంపిణీ చేశారు. నగరంలోని డాలర్స్ కాలనీలోనూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. డాలర్స్ కాలనీ కార్యక్రమంలో కెనరాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భవేంద్రకుమార్, సర్కిల్ ఆఫీస్ చీఫ్ జనరల్ మేనేజర్ మహేశ్‌పై పాల్గొన్నారు. ప్లకార్డులు ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు.




డాలర్స్ కాలనీలో స్వచ్ఛతా హీ సేవలో ప్లకార్డుల ప్రదర్శన



## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1626.06 | 1631.94 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 10,520 | 7,980 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 10,290 | 10,005 |
| నీటి నిల్వ (టీఎంసీలు) | 80.00 | 100.00 |

## టోల్ ప్లాజా వద్ద సౌకర్యాలు కల్పించండి



టోల్‌ప్లాజాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సండూరు తాలూకా యశ్వంత్‌నగర్ గ్రామ శివారులో కర్ణాటక రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్వహిస్తున్న టోల్‌ప్లాజా వద్ద సౌకర్యాలు కల్పించాలని పలు గ్రామాల ప్రజలు లారీ డ్రైవర్లు ఎమ్మెల్యే అన్నపూర్ణ తుకారాంను కోరారు. సర్వీస్ రోడ్లు, సీసీటీవీ కెమెరాలు, అంబులెన్స్‌లు, టాయిలెట్లు తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. ఇటీవల ఒక ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారన్నారు. టోల్‌ప్లాజా అధికారులు అంబులెన్స్ ఏర్పాటు చేయలేదని తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి బసప్ప ఆరోపించారు. దీనిపై అధికారులతో చాలాసార్లు చర్చించినా ప్రయోజనం లేదని ఎమ్మెల్యేకి విన్నవించారు. టోల్ సెంటర్‌ను పరిశీలించి ఎమ్మెల్యే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె టోల్ కలెక్షన్ సెంటర్ మేనేజర్‌ను ఫోన్‌లో మాట్లాడి వెంటనే సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

## పత్తిపంటలో తెగుళ్లపై అవగాహన



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

బళ్లారి గాంధీనగర్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులు సాగు చేసిన పత్తి పంటకు వచ్చే తెగుళ్లపై హగరి వ్యవసాయ విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పాలయ్య అవగాహన కల్పించారు. వ్యవసాయ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు తెగుళ్ల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బళ్లారి తాలూకా పరిధిలో పత్తి సాగుచేసే ప్రాంతాల్లో రైతుల్లో అవగాహన కల్పిస్తూ అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ రవి.ఎస్(మట్టి నమూనా నిపుణులు) డాక్టర్ నవీన్ కుమార్(వ్యవసాయం), పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

## పార్కులో స్వచ్ఛత కార్యక్రమం



స్వచ్ఛత కార్యక్రమంలో పౌరకార్మికులు, మున్సిపల్ సభ్యులు

బళ్లారి సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని సత్యనారాయణపేట లో రాఘవేంద్రస్వామి పార్కులో గురువారం ఉదయం కార్పొరేషన్ సభ్యులు, పౌర కార్మికులు స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపల్ సభ్యులు సుమా మాట్లాడుతూ పార్కులో చెత్తాచెదారం ఉండటంతో పార్కుకు వచ్చే వారికి వ్యాధులు సోకే ప్రమాదముందన్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఇక్కడికి చాలా మంది వృద్ధులు, ఆడుకోవడానికి పిల్లలు వస్తుంటారన్నారు. వారి ఆరోగ్య దృష్ట్యా పార్కు బాగుండాలన్నారు. 19వార్డు ప్రముఖుడు శంకర్, సభ్యులు రోహన్, అమరేశ్, బసవరాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

## వ్యభిచార గృహంపై దాడి

రాయచూరు సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ పట్టణం కొప్పర రహదారిలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. ఈ గృహంలో గతకొంత కాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. వ్యభిచార గృహం నిర్వహిస్తున్న మహిళ సుమంగళతో పాటు ఆమెకు సహకరిస్తున్న రాజవర్ధన్, ద్యావప్ప, రవిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6వేలకు పైగా నగదు, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను గురువారం కోర్టులో హాజరపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సీతారామాశ్రమంలో లలితాదేవి అలంకారం



చిన్నదుర్గమ్మ ఆలయంలో దుర్గమ్మకు అన్నపూర్ణేశ్వరీ దేవి అలంకారం



బెంకీ మారెమ్మకు ముత్యాల అలంకారం



కన్యకాపరమేశ్వరికి లక్ష్మీదేవి అలంకారం

# అన్నపూర్ణేశ్వరీ నమో నమః

● వివిధ రూపాల్లో అమ్మవార్ల దర్శనం

బళ్లారి సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు నగరంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లు పలు రూపాల్లో దర్శనమిచ్చారు. హంబావి శ్రీరామ ఆశ్రమంలో లలితాదేవి అలంకరణలో, అనంతపురం రోడ్డు పటేల్‌నగర్‌లోని చిన్నదుర్గమ్మకు అన్నపూర్ణేశ్వరీ, శ్రీలక్ష్మి వెంకటేశ్వర (ఎస్ఎల్‌వీ) కల్యాణమంటపంలో దేవికి జగన్నాథ్ అలంకారం, బెంకీమారెమ్మకు ముత్యాలతో అలంకారం, కన్యకాపరమేశ్వరీకి లక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కనకదుర్గమ్మ ఆలయాన్ని విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా అలంకరించారు.



ఎస్ఎల్‌వీ కల్యాణ మంటపంలో జగన్నాథ అలంకారం

# సర్వం కల్తీమయం..!

● ఆహారం కల్తీ.. జనారోగ్యం పల్టీ
● తనిఖీల్లో అధికారుల నిర్లక్ష్యం

బళ్లారి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కల్తీ ఆహారం బయట మార్కెట్‌లో ఎక్కువైపోయింది. పిల్లలు తాగే పాలతో మొదలుకుని ప్రతి ఆహారాన్ని కల్తీ చేస్తున్నారు. కొందరు సరుకుల తయారీదారులు, విక్రయదారులు కలిసి కల్తీ సరుకులు బయట మార్కెట్‌కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఏది కల్తీనో ఏది క్వాలిటీనో తెలుసుకోలేని జనం వాటిని తిని అనారోగ్యం పాలవుతున్నారు. కల్తీ సరుకులను నియమించాల్సిన అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడం విక్రయదారులు బాహాటంగానే అమ్ముతున్నారు. పిల్లలు తాగే పాలు, పండ్లు, బియ్యం, సబ్బులు ఆయిల్ ఇలా అన్నీ కల్తీ వస్తువులు మార్కెట్‌లోకి వచ్చేస్తున్నాయి. కొందరు నకిలీ వస్తువుల తయారీదారులు బ్రాండెడ్ కంపెనీల కవర్లు తయారు చేసి వాటిలో కల్తీ సరుకులు వేసి విక్రయిస్తున్నారు. బళ్లారిలో ఏపీఎంసీ మార్కెట్‌లో ఒక నూనె గోడాన్‌లో కల్తీ నూనె



తయారు చేసే వారికి ఇంతక ముందు ఫుడ్ క్వాలిటీ ఆఫీసర్ తనిఖీలు చేసి పట్టుకున్నారు. అలాగే సిరుగుప్పలో కల్తీ బియ్యం తయారు చేసే ఒక నకిలీ ముఠాను ఫుడ్ చెకింగ్ బృందం పట్టుకుంది. అడపాదడపా అధికారులు దాడులు చేస్తున్నా కల్తీ వస్తువుల తయారీదారులు తగ్గడం లేదు. బళ్లారి, విజయనగర, కొప్పళ, రాయచూరు జిల్లాల్లోని అనేక నియోజకవర్గాల్లో కల్తీ సరుకులు పెరిగాయి. ఇక్కడ ప్రజలు చాలా మంది నిరక్షరాస్యులు కావడంచ దిన కూలీలుగా పనిచేస్తూ ఉండటంవల్ల ఎక్కువగా కల్తీ సరుకులు మార్కెట్‌లో చలామణి అవుతున్నాయి. ప్రజలు తినే నిత్యావసర వస్తువులతో పాటు పిల్లలు తాగే పాలు కూడా కల్తీగా మార్చి కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. హువ్వినహగడలి, కూడ్లిగిలో కల్తీ సోపులు, బియ్యం, కారం పౌడర్ కూడా కల్తీవిగా ఉంటున్నాయి. ఇక గ్రామీణ ప్రాంతాల్లో జనం తాగే టీ పౌడర్ కూడా కల్తీ చేస్తున్నారు. ఇలా అనేక చోట్ల కల్తీ సరుకుల కారణంగా జనం అనారోగ్యం పాలవుతున్నారు. ప్రజలు బతకడానికి ఆహారం తింటుంటే అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇంతక ముందు ఎక్కువగా ఇక్కడ కల్తీ ఎరువులు, మందులు తయారు చేసే ముఠా ఉండేది. ప్రస్తుతం కల్తీ సరుకుల తయారు చేసే ముఠా తయారైంది.

దీనిపై ఫుడ్ క్వాలిటీ చెకింగ్ ఆఫీసర్‌ను వివరణ కోరగా కల్తీ సరుకులపై దాడులు చేస్తూనే ఉన్నామన్నారు. కల్తీ వస్తువులు ఎక్కడ తయారీ చేస్తున్నది సమాచారం ఇస్తే వాటిని సీజ్ చేస్తామన్నారు. ఇంతక ముందు కల్తీ నూనె తయారు చేసే కంపెనీ గోడన్‌ను సీజ్ చేశామని గుర్తు చేశారు.

## 29న జన స్పందన: కలెక్టర్

బళ్లారి సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించేందుకు 29న నగరంలోని జిల్లాపరిపాల భవనం ఆవరణలో జిల్లా స్థాయి జనస్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్ గురువారం తెలిపారు. గృహనిర్మాణం, వక్ఫ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ప్రజల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారాలను చూపుతామన్నారు. నగరంలోని కొత్త పరిపాలన భవన ఆడిటోరియంలో జనస్పందన కార్యక్రమం నిర్వహణపై ప్రాథమిక సమావేశం నిర్వహించారు. ప్రజల ఫిర్యాదులను వినడానికి వాటిని పరిష్కరించడానికి 29న నగరంలోని అనంతపురం రోడ్డులోని కొత్త జిల్లా కలెక్టర్ భవనం ఆవరణలో కార్యక్రమం ఉంటుందన్నారు. వివిధ విభాగాల నుంచి దరఖాస్తులను స్వీకరించడానికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై సమాచారాన్ని నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే దివ్యాంగులు, వృద్ధుల కోసం





మాట్లాడుతున్న కలెక్టర్ నాగేంద్ర ప్రసాద్

ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత, తాగునీటి ఏర్పాట్లు, భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా ఇన్‌చార్జిమంత్రి వివిధ ప్రాజెక్టులకు అదే రోజు శంకుస్థాపన చేస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం జిల్లా పంచాయతీ హాల్లో మొదటి త్రైమాసిక సమావేశాన్ని నిర్వహిస్తారని కలెక్టర్ తెలిపారు. అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్ జుబేరా, జడ్పీ డిప్యూటీ సెక్రటరీ శశికాంత్ శివపురే, మున్సిపల్ కార్పొరేషన్ మంజునాథ్, వివిధ జిల్లా స్థాయి శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కురుబలను ఎస్టీల్లో చేర్చరాదని ఆందోళన



రాయల్ సర్కిల్ వద్ద నిరసన తెలుపుతున్న వాల్మీకుల

బళ్లారిరూరల్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): కురుబలను ఎస్టీలో చేర్చవద్దని గురువారం వాల్మీకి సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. నగరంలో గురువారం రాజ్ కుమార్ రోడ్డు, కాకి పార్క్ నుంచి వాల్మీకి సంఘం నాయకుల ఆధ్వర్యంలో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం చేరుకుని కలెక్టర్ నాగేంద్రప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. అఖండ వాల్మీకి కర్ణాటక రాజ్యాధ్యక్షుడు జోళదరాసి తిమ్మప్ప మాట్లాడుతూ కురుబలను ఎస్టీ కులంలోకి చేర్చే ప్రయత్నాన్ని సిఎం సిద్దరామయ్య మానుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలో సీఎం నివాసాన్ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్దన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు ఎర్రగుడి ముద్దమల్లయ్య, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, అడ్వకేట్ జయరాం, రైతు నాయక సింధిగేరి, గోవిందప్ప, రూపనగుడి, వెంకటేష్, గోవిందప్ప, మోకా, పత్తారు వెంకటేష్, అర్దగిరి రామన్న, కార్పొరేటర్ హనుమంత, బీజేపీ ప్రముఖులు ఓబులేశ్, కార్పొరేటర్ శశికళ, ఎర్రగుడి గోపాల్, పుష్ప, చంద్రశేఖర్, మాజీ కార్పొరేటర్ నాగమ్మ, వాల్మీకి కులస్థులు పాల్గొన్నారు.

హోస్పేట,(ఆంధ్రజ్యోతి): స్థానిక అప్పుసర్కిల్‌లో కురుబలను ఎస్టీలో చేర్చాలనే ప్రభుత్వ ఉద్దేశ్యానికి వ్యతిరేకంగా గురువారం వాల్మీకి సంఘం నాయకులు నిరసన తెలిపారు. వాల్మీకి సమాజ నాయకుడు బోసల్ భర్మప్ప మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు భవిష్యత్తులో నిర్వహించే వాల్మీకి జయంతిలో పాల్గొనకూడదని ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. ప్రభుత్వం ఉపకులాలను సృష్టిస్తూ వర్గాల్లో గందరగోళం నెలకొనేలా చేస్తోందన్నారు. తహసీల్దార్, అదనపు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం స్వీకరించడానికి వచ్చారు. కానీ నిరసనకారులు వారికి వినతి పత్రం ఇవ్వడానికి అంగీకరించలేదు. చివరకు కలెక్టర్ వచ్చి వినతి పత్రం స్వీకరించి ప్రభుత్వానికి పంపుతామని చెప్పడంతో నిరసనను విరమించారు. సమాజ దేవర మణి శ్రీనివాస్, మారనడి జంబయ్యనాయక్ పాల్గొన్నారు.



అప్పుసర్కిల్‌లో నిరసనలో పాల్గొన్న ఆందోళనకారులు

## ఈ-సేవ కేంద్రాలను వినియోగించుకోండి

● జిల్లా న్యాయాధికారి జె.శాంతి

బళ్లారి సిటీ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఈ కోర్టు మిషన్ మోడ్ పథ కం కింద పౌర కేంద్రీకృత సేవలను అందించడంలో ఈ-సేవా కేంద్రాల స్థాపన ముఖ్యమైన అడుగు అని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ న్యాయాధికారి జె.శాంతి అన్నారు. సండూర్ కోర్టు, హగరిబొమ్మనహళ్ళి కోర్టులలో ఈ-సేవా కేంద్రాలు, హెల్ప్ డెస్కులు, వీసీ క్యాబిన్‌ల వర్చువల్ ప్రారంభోత్సవంలో ఆమె మాట్లాడారు. ఈ-సేవ కేంద్రాల ద్వారా కక్షిదారులు, న్యాయవాదులు, ప్రజలు తమ కేసుల స్థితిని సులభంగా తెలుసుకోవచ్చన్నారు. వారు ఆన్‌లైన్ చెల్లింపులు చేయవచ్చని తెలిపారు. ఎలక్ట్రానిక్ కేసులు దాఖలు చేయవచ్చని, వివిధ డిజిటల్ సౌకర్యాలను సులభంగా పొందవచ్చని అన్నారు. కోర్టు సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావడం, సరసమైనదిగా, వినియోగదారులకు అనుకూలంగా మార్చడం ద్వారా ఈ-సేవ కేంద్రాలు,ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి ప్రయోజనం చేకూరుస్తాయని అన్నారు. ప్రస్తుత కాలంలో కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోతే నిరక్షరాస్యులు అని అంటారన్నారు. కార్యక్రమంలో హగరిబొమ్మనహళ్లి, సండూర్ కోర్టుల న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.





కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయాధికారి జె శాంతి

## గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

● డీహెచ్ఓ రమేశ్‌బాబు



ఆస్పత్రిలోని మహిళా వార్డును పరిశీలిస్తున్న డీహెచ్ఓ

బళ్లారి సిటీ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): గర్భిణులు ప్రతి నెలా 9, 24 తేదీల్లో ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని డీహెచ్ఓ రమేష్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ సాధారణంగా గర్భం దాల్చిన 12వారాల లోపు తల్లిసమీపంలోని ఆస్పత్రికి వెళ్లి కార్డు పొందడానికి చెక్-అప్ చేయించుకోవాలన్నారు. అమె బరువు, రక్తపోటు, ఇతర అవసరమైన పరీక్షలు ప్రతి నెలా చేయించుకోవాలని సూచించారు. దీనివల్ల ప్రసవ సమయంలో అవసరమైన ఒత్తిడిని నివారించవచ్చన్నారు. ప్రస్తుతం ప్రతినెలా 9వ తేదిన గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. మొదటిసారి గర్భం దాల్చిన మహిళలు ఎత్తు తక్కువగా ఉండటం, అధిక రక్తపోటు ఇతర అవసరమైన పరీక్షలు చేయించుకోవాలన్నారు. రక్తహీనత ఉన్న సందర్భాల్లో ఐఎఫ్ఏ, ఐరన్, సుక్రోజ్, రక్తమార్పిడి వంటి చికిత్సలు అందించాలన్నారు. ఎటువంటి మెరుగుదల లేకపోతే వెంటనే నిపుణుడి వద్దకు వెళ్లాలన్నారు. అవసరమైన స్కాన్ చేయాలని, మొదటి డెలివరీ శస్త్రచికిత్స ద్వారా జరిగితే తిరిగి గర్భధారణ కాలాన్ని 3సంవత్సరాలు వాయిదా వేయడం తప్పనిసరి అన్నారు. శరీరకంగా ధృడంగా ఉండటానికి కాల్షియం మాత్రలను వేసుకోవాలన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని వినతి



ప్రిన్సిపాల్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న ఏఐడీఎస్ఓ నాయకులు

బళ్లారి సిటీ, సెప్టెబరు 25(ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సరళాదేవి కళాశాల, ఎస్ఆర్ఎం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రజా ప్రచారం నిర్వహించి ప్రిన్సిపాల్‌కు ఏఐడీఎస్ఓ వినతిపత్రం సమర్పించింది. ఏఐడీఎస్ఓ జిల్లా అధ్యక్షుడు ఈరన్న మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో గెస్ట్ లెక్చరర్ల నియామకంలో గందరగోళం కారణంగా విద్యార్థులు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ద్వారా ఉన్నత విద్యా మంత్రికి వినతి పత్రం సమర్పించారు. అలాగే శనివారం రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల తరగతుల బహిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## 'వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహిద్దాం'



మాట్లాడుతున్న తహసీల్దార్ గౌసియాబేగం

సిరుగుప్ప, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహిద్దామని తహసీల్దార్ గౌసియా బేగం పిలుపునిచ్చారు. సిరుగుప్ప శిశు అభివృద్ధి యోజన కార్యాలయంలో అక్టోబరు 7న జరుగనున్న వాల్మీకి జయంతిని నిర్వహించడంపై పూర్వాపరాల సిద్దత సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ హైస్కూలు గ్రౌండ్ నుంచి తాలుకా పంచాయతీ వరకు వాల్మీకి చిత్రపటం ఊరేగింపు ఉంటుందన్నారు. అనంతరం వేదిక కార్యక్రమం నిర్వహించాలని ఆమె తెలిపారు. వాల్మీకి సంఘం అధ్యక్షుడు నరసింహ నాయక్ ప్రముఖుల సలహాలను అధికారులు తీసుకున్నారు. ఎస్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ రాఘవేంద్ర వర్మ, పరమేష, సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ మడ్డేరు సిద్దయ్య పాల్గొన్నారు.

## నకిలీ కులధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలి

రాయచూరు సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): అక్రమ మార్గంలో నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు పొంది మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వాల్మీకి ఐక్య వేదిక నాయకులు డిమాండ్ చేశారు. బీసీ జాబితాలోని పలు కులాలకు చెందిన వారు తళవార్ నాయక్ పేరుతో ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు పొంది మోసగిస్తున్నారని ఆరోపించారు. వీరికి సహకరిస్తూ తప్పుడు ధ్రువపత్రాలు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని వాల్మీకి సర్కిల్ నుంచి జిల్లాధికారి కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, ఏడీసీకి వినతి పత్రం అందజేశారు.



డీసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వాల్మీకి ఐక్య వేదిక నాయకులు

# హోసూరు జోన్

## పెళ్లికాని వారికి పార్కులో నిషేధం

● రామనాయకన్ చెరువు పార్కులో ప్రకటన

హోసూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని రామనాయకన్ చెరువు 152 ఎకరాలలో విస్తరించి ఉంది. ఇక్కడి పార్కులో పెళ్లికాని వారికి అనుమతి ఉండదని పేర్కొంటూ ప్రకటించారు. స్థానికంగా ఈ అంశం చర్చనీయాంశమైంది. చెరువుకు అనుబంధంగా 4 ఎకరాలలో పిల్లలపార్కును ఏర్పాటు చేశారు. పార్కులో వాకింగ్ ట్రాక్, వ్యాయామ పరికరాలు, ధ్యానమందిరం, ట్రీ పార్క్, చెరువు వెంబడి కూర్చోవడానికి బెంచీలు అమర్చారు. సెలవురోజుల్లో కుటుంబాలతో వచ్చి పార్కులో గడుపుతుంటారు. అయితే ఇటీవల యువత ప్రత్యేకించి పాఠశాల, కళాశాల విద్యార్థులు వచ్చి ముఖం చాటేయడానికి, మద్యం తాగడానికి అడ్డాగా మారందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. నైట్‌గార్డ్ లేకపోవడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ఉదయం, సాయంత్రం మాత్రమే ప్రజలకు అనుమతించేలా కార్పొరేషన్ అనుమతి ఇచ్చింది. ఆరోపణల నేపథ్యంలో పార్కు ప్రవేశద్వారం వద్ద పెళ్లికానివారికి అనుమతి లేదంటూ పోలీసులు బ్యానర్లు అమర్చారు. దీనిపై పలురకాల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పార్కులో నిఘా పెంచాలని ఇలా చేయడం సరికాదని కొందరు సోషల్‌మీడియాలో కామెంట్‌లు చేస్తున్నారు.





పార్కు ముందు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

## దివ్యాంగుల కోసం జాగృతి ర్యాలీ

హోసూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో దివ్యాంగులకు సమానత్వం, రక్షణ, సాధికారత అనే అంశంపై బ్రహ్మకుమారీల సంఘం దివ్యాంగుల సేవా విభాగం ఆధ్వర్యంలో గురువారం జాగృతి ర్యాలీ నిర్వహించారు. హోసూరులోని మూడు ప్రాంతాలలో కార్యక్రమాలు కొనసాగాయి. అన్నై అరబిందో స్కూల్ ఫర్ ది డిఫరెంట్లీ ఏబుల్డ్, నివేదిత స్కూల్, లిటిల్ హార్ట్స్ డిసేబుల్డ్ పర్సన్స్ సెంటర్ల సహకారంతో తమిళనాడు జోన్ బ్రహ్మకుమారీస్ ఆర్గనైజేషన్ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దివ్యాంగులకు కూడా పలు రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బ్రహ్మకుమారీస్ సంఘం జోన్ నిర్వాహకులు ప్రసాద్, కాళిదాస్, ముత్తుమరి, ముత్తుచెల్వి, అక్షయ, హోసూరు శాఖ నిర్వాహకులు రామలింగం, గౌరమ్మ లోగనాథన్ బాలసుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

## పవన్ కల్యాణ్ అభిమానుల సందడి

సిరుగుప్ప, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓజీ సినిమా విడుదల సందర్భంగా బాలాజీ థియేటర్‌లో భారీ సందడి నెలకొంది. ఆయన అభిమానుల సంఘం అధ్యక్షుడు మూర్తి పవన్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. అభిమానులు డీజేతో కోలాహలంగా డ్యాన్సులు చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు.



థియేటర్ ఎదుట పవన్ అభిమానుల సంబరాలు

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

### ఈశ్వరచంద్ర విద్యాసాగర్ (జయంతి)



ప్రముఖ బెంగాలీ కవి ఈశ్వరచంద్ర విద్యాసాగర్ 1820 సెప్టెంబరు 26న పశ్చిమబెంగాల్ రాష్ట్రం బిర్సింగా గ్రామంలో జన్మించారు. విద్యావేత్త, తత్వవేత్త, పారిశ్రామికవేత్త, రచయిత, అనువాదకుడు, సమాజ సేవకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. బెంగాలీ లిపిని 1780 తర్వాత మొదటిసారి క్రమబద్ధీకరించిన ఘనత ఆయనదే. తండ్రి బాటలో సంస్కృత ఉపాధ్యాయుడిగా రాణించారు. అయితే సంస్కృత భాష అన్ని కులాలవారికి, మహిళలకు కూడా నేర్పించాలని పోరాటం చేశారు. సంస్కృత ముద్రణాలయం ఏర్పాటులో ఎంతో కృషి చేశారు. 1891 జూలై 29న కన్నుమూశారు.

### చిలకమర్తి లక్ష్మీనరసింహం (జయంతి)



ప్రముఖ సంఘసంస్కర్త చిలకమర్తి లక్ష్మీనరసింహం 1867 సెప్టెంబరు 26న పశ్చిమగోదావరి జిల్లా పెరవలి మండలం ఖండవల్లి గ్రామంలో జన్మించారు. కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయుడిగా రాణించారు. 19వ శతాబ్దం చివరన, 20వ శతాబ్దం ఆరంభంలో తెలుగు సాహిత్య అభివృద్ధికి, తెలుగునాట ఆధునిక భావాల వికాసానికి పట్టుగొమ్మలైన వారిలో చిలకమర్తి ఒకరు. 22 ఏళ్లకే రచించిన గయోపాఖ్యానం అనే నాటకం లక్షకుపైగా ప్రతులు అమ్ముడవడం ఒక రికార్డు. నిమ్న జాతుల కోసం ప్రత్యేకంగా పాఠశాలను స్థాపించిన ఘనత ఆంధ్రదేశంలో ఆయనకే దక్కుతుంది. 30వ యేట రేచీకటికి గురైన శ్రమించి రచనలు చేశారు. కొద్దికాలం అష్టావధానాలు చేశారు. 1946 జూన్ 17న కన్నుమూశారు.

### పాపనాశం శివన్ (జయంతి)



కర్ణాటక సంగీత విద్వాంసుడు పాపనాశం శివన్ 1890 సెప్టెంబరు 26న తంజావూరు జిల్లా పొలగం గ్రామంలో జన్మించారు. 1930, 40 దశకాలలో కన్నడ, తమిళ సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. తమిళ త్యాగరాజుగా పేరొందారు. ఆయన స్వరపరిచిన కృతులను ఎంకే త్యాగరాజ భాగవతార్, ఎంఎస్ సుబ్బులక్ష్మి ప్రచారంలోకి తెచ్చారు. కాగా దైవభక్తి కల్గిన ఈయన తరచుగా పాపనాశంలోని ఆలయానికి వెళ్లి అక్కడి భస్మాన్ని రాసుకునేవారు. దాంతో పాపనాశం శివన్‌గా పిలిచేవారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ లభించగా, సంగీత కళానిధి, సంగీత కళాశిఖామణి, పద్మభూషణ్ పురస్కారాలు అందుకున్నారు. 1973 అక్టోబరు 1న కన్నుమూశారు.

### దేవానంద్ (జయంతి)



ప్రముఖ హిందీ నటుడు దేవానంద్ 1923 సెప్టెంబరు 26న పంజాబ్ రాష్ట్రం సకార్‌గర్ ప్రాంతంలో జన్మించారు. 65ఏళ్ల సినీ కెరీర్‌లో సినీ రచయితగా, నిర్మాత, దర్శకుడిగా రాణించారు. 114 సినిమాలలో నటించారు. దేశ సినీ రంగంలో విజయవంతమైన నటుడిగా గుర్తింపు పొందారు. పద్మభూషణ్, దాదా సాహెబ్ ఫాల్కె అవార్డు, ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2011 డిసెంబరు 3న ఆయన జ్ఞాపకార్థం ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

### డాక్టర్ మన్మోహన్‌సింగ్ (జయంతి)



దేశ ప్రధానిగా వ్యవహరించిన మన్మోహన్‌సింగ్ 1932 సెప్టెంబరు 26న పంజాబ్ రాష్ట్రం (ప్రస్తుతం పాకిస్థాన్‌లోని చక్వాల్)లో జన్మించారు. ప్రపంచంలో పేరొందిన ఆర్థికవేత్తలలో ఒకరిగా నిలిచారు. ఆర్థికశాస్త్రంలో లెక్చరర్‌గా, రీడర్‌గా, ప్రొఫెసర్‌గా పనిచేశారు. రిజర్వుబ్యాంకు డైరెక్టర్‌గా, ఆర్థికశాఖ కమిషన్ సభ్యుడిగా, ప్రధానమంత్రి ఆర్థిక సలహాదారుల కౌన్సిల్‌లో సభ్యుడిగా, ఇండియన్ ఎకనమిక్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ ఛైర్మన్‌గా వివిధ హోదాలలో వ్యవహరించారు. పద్మవిభూషణ్, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2024 డిసెంబరు 26న కన్నుమూశారు.

### సెరెనా విలియమ్స్ (పుట్టినరోజు)



సెరెనా జమేకా విలియమ్స్ 1981 సెప్టెంబరు 26న యునైటెడ్ స్టేట్స్ మిచిగాన్ ప్రాంతంలో జన్మించారు. ప్రపంచంలో ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణిగా పేరొందారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఇలా అన్ని విభాగాలలో 23 గ్రాండ్ స్లామ్ టైటిల్స్ అందుకున్న ఘనత ఆమెదే. ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్ ప్రకటించిన 'సింగిల్స్‌లో వరల్డ్ నెంబరు1'గా 8సార్లు 2002 నుంచి 2017 వరకు నిలిచారు. 2022 సెప్టెంబరులో టెన్నిస్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఆమె అనేక చారిటీ సంస్థలకు అండగా నిలుస్తున్నారు. ఇటీవల ప్రిన్సెస్ ఆఫ్ ఆస్ట్రియాస్ అవార్డు అందుకున్నారు.

### అభిషేక్ రఘురాం (పుట్టినరోజు)



అభిషేక్ రఘురాం 1985 సెప్టెంబరు 26న జన్మించారు. ప్రముఖ మృదంగం కళాకారుడు పాల్ఘాట్ ఆర్ రఘు మనుమడు. కర్ణాటక గాత్ర సంగీతకారుడిగా రాణిస్తున్నారు. ఆలిండియా రేడియోలో ఏ గ్రేడ్ ఆర్టిస్ట్‌గా ఉన్నారు. కంచికోటి కామకోటి పీఠం ఆస్థాన విద్వాన్‌గా, షణ్ముఖ సంగీత శిరోమణి పురస్కారం, తదితర పురస్కారాలు అందుకున్నారు.

## పౌరకార్మికులకు ఆరోగ్య పరీక్షలు

సిరుగుప్ప, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): పౌరకార్మికులు నిరంతరం సేవలు చేయడం వలన మానసిక ఒత్తిడి సర్వసామాన్యంగా వస్తుందని నగరసభ కమిషనర్ గంగాధర తెలిపారు. పట్టణ నగరసభ ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి దమ్మూరు సోమప్ప పౌరకార్మికులకు ఆరోగ్యపరీక్షలు చేశారు.

# కార్పొరేట్ సంస్థలకు గులాంగిరి

**బ్యాంకర్లపై మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్ ఆగ్రహం**




ప్రసంగిస్తున్న మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్

బాగేపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు కార్పొరేట్ కంపెనీలకు గులాం కావడంతో వ్యవసాయం, రైతులు సంక్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటున్నారని మాజీ స్పీకర్ కేఆర్ రమేశ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలూకా పంచాయతీ కార్యాలయం వద్ద అఖిల కర్ణాటక రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటైన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. రైతులు, నీరావరి పోరాటాలకు కేంద్రమైన వ్యవసాయరంగానికి సమస్యలు ఎదురైనప్పుడు ప్రభుత్వం నుంచి రైతులకు పథకాలు అందేందుకు అఖిల కర్ణాటక రైతుసంఘం పార్టీలతో సంబంధం లేకుండా పోరాటం చేయాలన్నారు. ఎండ, వాన, చలి, రాత్రి పగలు తేడా లేకుండా శ్రమిస్తున్న రైతులకు జాతీయబ్యాంకులనుంచి సరైన రుణాలు లభించడం లేదన్నారు. అయితే ప్రభుత్వాలు శ్రీమంతులు, కార్పొరేట్ కంపెనీల యజమానులకు రుణాలు మాఫీ చేస్తున్నారన్నారు. రైతులు చేసిన రుణాలకు బ్యాంకులనుంచి నోటీసు వస్తోందని, కోట్లాదిరూపాయల బకాయి ఉన్న శ్రీమంతులు విదేశాలలో ఉన్నవారికి నోటీసు ఇవ్వడం లేదన్నారు. రైతులు పండించే పంటలకు శాస్త్రీయధర లభించడం లేదన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌లలో దళారీలకు కమీషన్ పెరిగిందని, రైతులకు న్యాయం జరగడం లేదన్నారు. రైతులు నేరుగా వ్యాపారం చేసుకునే అవకాశం లభిస్తేనే పంటలకు కనీసధర లభించే అవకాశం ఉందన్నారు. రైతులు పండించే పంటలకు కార్పొరేట్ కంపెనీలు ధర నిర్ణయించడం వద్దన్నారు. ఎరువులు, విత్తనగింజలకు తగిన ధర నిర్ణయించాలన్నారు. కమ్యూనిస్టుల నేల బాగేపల్లి క్షేత్రం పోరాటాలకు నెలవుగా ఉందన్నారు. అప్పస్వామిరెడ్డి, శ్రీరామరెడ్డి, హెచ్ఎస్ రామరావ్, నాగభూషణం వంటి నాయకులు రైతులకోసం ఎంతో పోరాటం చేశారన్నారు. తెలంగాణ పోరాటాన్ని స్మరించుకున్నారు. ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు, వ్యవసాయం మనుగడ సాధిస్తేనే దేశం పురోగతి సాధ్యమన్నారు. ఇందుకుగాను వ్యవసాయం, రైతుల సంక్షేమాలకు ప్రభుత్వాలు అదనపు గ్రాంట్లు ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘం తాలూకా సంచాలకులు పీ మంజునాథరెడ్డి, పురసభ అధ్యక్షుడు ఏ శ్రీనివాస్, రమేశ్ బాబు, హేమచంద్ర, లక్ష్మీనరసింహప్ప, అంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శిడ్లఘట్టలో స్వచ్ఛతా అభియాన్



స్వచ్ఛతా అభియాన్‌లో కెనరాబ్యాంకు, నగరసభ సిబ్బంది తదితరులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జయంతి నేపథ్యంలో ఏటా నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నగరసభ, కెనరా బ్యాంకు సిబ్బంది గురువారం నిర్వహించారు. నగరసభ అధ్యక్షుడు ఎంవీ వెంకటస్వామి నేతృత్వం వహించి మాట్లాడుతూ ఒకరోజు - ఒకగంట స్వచ్ఛత అనే నినాదంతో కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్టు తెలిపారు. అక్టోబరు 2 వరకు అభియాన ఉంటుందన్నారు. అందరూ కలసికట్టుగా తమ చుట్టుపక్కల ప్రాంతాలను స్వచ్ఛంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమన్నారు. కార్యక్రమంలో నగరసభ అధికారులు నరేశ్, భువన్ మేస్త్రి, గిరీశ్‌రెడ్డి, శిడ్లఘట్ట పట్టణ కెనరాబ్యాంకు సీనియర్ మేనేజర్ వెంకటపతి, బ్యాంకు సిబ్బంది నజీనా, జానవి, అవినాశ్, వీణా, శివణ్ణ, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

## జలజీవన్ మిషన్‌లో అక్రమాలు

**జడ్పీ సీఈఓకు ఫిర్యాదు**



జడ్పీ సీఈఓతో గ్రామపంచాయతీ అధ్యక్షుడు, సభ్యులు

దొమ్మసంద్ర, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ జలజీవన్ మిషన్ పథకంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. 9 కోట్ల రూపాయలలో పనులు చేయకనే రూ.2.52 కోట్ల బిల్లులు కాంట్రాక్టర్ వినయ్ ఇతర అధికారులు స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆనేకల్ తాలూకా సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామం 13వ వార్డులో పనులు చేయకనే బిల్లులు స్వాహా చేశారనే విమర్శలు ఉన్నాయి. వినయ్ అనే కాంట్రాక్టర్ నాణ్యమైన పైపులు అమర్చలేదని, కాంక్రీట్‌రోడ్డులో నాణ్యత లేకపోవడంతో గుంతలు ఏర్పడ్డాయని జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి యతీశ్‌కు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మంజునాథ్‌కు దొమ్మంద్ర గ్రామపంచాయతీ అధ్యక్షుడు నరేశ్ ఫిర్యాదు చేశారు. వినయ్ కాంట్రాక్టును రద్దు చేయాలని కోరారు. జలజీవన్ మిషన్ పథకం పనులు సక్రమంగా, నాణ్యతగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. జడ్పీ సీఈఓతో భేటీ వేళ దొమ్మసంద్ర అధ్యక్షుడు నరేశ్, సభ్యులు సంతోష్, సురేశ్, మురళి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## లాభాలబాటలో వీఎస్ఎస్ఎన్ సహకార సంఘం



వీఎస్ఎస్ఎన్ సహకార సంఘం సర్వసభ్య సమావేశం

విజయపుర, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వివిధోద్దేశ్య ప్రాథమిక గ్రామీణ కృషి సహకారసంఘం 2024-25 సంవత్సరానికి 13.17 లక్షల లాభం గడించి తాలూకాలోని సహకారసంఘాలలో లాభాలబాటలో ఉన్న సంఘాలలో నాల్గోస్థానంలో నిలిచింది. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా సహకారసంఘం డైరెక్టర్ రమేశ్ ముఖ్యులుగా పాల్గొని మాట్లాడుతూ లాభాలబాటలో సహకారసంఘం ఉండడంపై ప్రశంసలు వ్యక్తం చేశారు. నందిని విద్యానికేతన్ స్కూల్ కార్యదర్శి చేతన్‌గౌడ మాట్లాడుతూ సహకారసంఘానికి ఏకగ్రీవంగా ప్రతినిధులు ఎంపికయ్యారన్నారు. సహకారసంఘం అధ్యక్షుడు ఎం వీరణ్ణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రధాని కొత్త జీఎస్టీ విధానంతో సామాన్యులు, రైతులకు అనుకూలం అయ్యిందన్నారు. యువత వ్యవసాయం చేస్తుంటే వారికి పిల్లలు ఇవ్వడంలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎయిర్‌పోర్ట్‌లో పనిచేసేవారికి కూడా పిల్లలు ఇస్తున్నారని, సొంతంగా వ్యవసాయం చేసి లక్షలు సంపాదించేవారికి పెళ్లికూతుళ్లు దొరకడం లేదన్నారు. సమావేశంలో సంఘం మాజీ అధ్యక్షుడు కెంపణ్ణ, హరోహళ్ళి గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు సుబ్బణ్ణ, ముద్దేనహళ్ళి గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# భైరప్ప స్మారక నిర్మాణానికి సీఎం అంగీకారం



భైరప్ప పార్థివదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం సిద్దరామయ్య

బెంగళూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కన్నడ సాహితీదిగ్గజం, పద్మభూషణ్ పురస్కార గ్రహీత ఎస్ఎల్ భైరప్ప స్మారక నిర్మాణానికి సీఎం సిద్దరామయ్య అంగీకారం తెలిపారు. కన్నడ సంస్కృతిశాఖ, బెంగళూరు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్ర కళాక్షేత్రలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భైరప్ప పార్థివదేహాన్ని సందర్శించే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా సీఎం ఆయనకు నివాళులు సమర్పించారు. ప్రతిపక్షనేత అశోక్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర తదితరులు భైరప్ప స్మారక నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం యడియూరప్ప, ఎంపీ పీసీ మోహన్, కేంద్ర మంత్రి శోభ్లాకరంద్లాజె తదితరులు భైరప్పకు నివాళులు సమర్పించారు. ఇందుకు సీఎం స్పందిస్తూ భైరప్ప స్మారక నిర్మాణంకోసం ప్రభుత్వం ప్లాన్‌చేసేందుకు ఆలోచిస్తోందన్నారు. యడియూరప్ప మాట్లాడుతూ సీనియర్ సాహితీవేత్త, నవలా రచయిత భైరప్ప లేని లోటు సాహితీలోకానికి తీరనిలోటు అన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# ఇంధన ల్యాండ్‌మార్క్‌గా సత్యసాయి

- కలెక్టర్ శ్యాంప్రసాద్
- రామగిరిలో 300 మెగావాట్ల సోలార్‌విద్యుత్ ప్రాజెక్టు
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ



సోలార్ ప్రాజెక్టు శంకుస్థాపనలో కలెక్టర్ తదితరులు

రామగిరి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాబోయే రోజుల్లో ఇంధనం విషయంలో శ్రీసత్యసాయి జిల్లాను ప్రపంచంలోనే ఒక ల్యాండ్‌మార్క్‌గా నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ గురువారం మధ్యాహ్నం రాజస్థాన్ రాష్ట్రం బాన్స్వార నుంచి వర్చువల్‌గా రామగిరిలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. రామగిరిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు రాబోయే రోజుల్లో అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పునరుత్పాదక ఇంధనంలో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్తుందన్నారు. రామగిరిలో 1047ఎకరాలలో 300మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడం సంతోషదాయకమన్నారు. సీఎం చంద్రబాబునాయుడు విజనరీ లీడర్ అని, ఆయన ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. మన రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకుపోవడానికి సీఎం చంద్రబాబుకు మనమందరం తోడ్పాటు అందించాలని అవసరం ఉందన్నారు. రెన్యూవబుల్ ఎనర్జీలో మన రాష్ట్రం పయనీరుగా ఉంది. ఇప్పటి వరకు రాష్ట్రం మొత్తంమీద దాదాపు 5వేల మెగా వాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో ఇంధనంలో ప్రపంచంలోనే శ్రీసత్యసాయి జిల్లా ఒక ల్యాండ్‌మార్క్‌గా మారేందుకు కృషి చేస్తున్నామన్నారు. బొగ్గు ఆధారిత విద్యుత్‌తో పోలిస్తే క్లీన్‌అండ్ గ్రీన్ ఎనర్జీ పర్యావరణానికి ఎంతో మేలు కలిగిస్తుందన్నారు. ఈ సందర్భంగా సోలార్ ఏర్పాటులో కృషిచేసిన అచీవర్స్‌కు కలెక్టర్ చేతులమీదుగా అవార్డులు అందజేశారు. శంకుస్థాపన కార్యక్రమంలో సెకీ వీసీఅండ్ ఎండీ కమలాకర్‌బాబు, ఆర్డీఓ మహేష్, సెకీ ఈడీ శివశంకర్‌నాయుడు, తహసీల్దార్ రవికుమార్‌తో పాటు పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం: డీఎంఈ




మాట్లాడుతున్న సీనియర్ డీఎంఈ రమేష్

గుత్తి, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని డీజిల్ ఎలక్ట్రికల్ లోకో షెడ్ సీనియర్ డీఎంఈ రమేష్ పేర్కొన్నారు. గుత్తిఆర్ఎస్‌లో రైల్వే ఇనిస్టిట్యూట్ క్రీడామైదానంలో అంతర్ రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. గౌతమి పూరి ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ, రైల్వే ఇనిస్టిట్యూట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రేమ్, సూరి మెమోరియల్ టోర్నమెంట్‌ను డీఎంఈ రమేష్, మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మీయా, ఎస్ఐ సురేష్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దివంగత క్రీడాకారులు ప్రేమ్, సూరి మెమోరియల్ టోర్నమెంట్‌ను వారి జ్ఞాపకార్థం స్నేహితులు నిర్వహించడం అభినందనీయం అన్నారు. టోర్నమెంట్‌లో కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్, రాజా, నవీన్, గిరిబాబు, డాడి, ప్రసాద్, హరినాథ్‌రెడ్డి, చాంద్, విజయ్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లోకి పలువురి చేరిక



అంజినప్ప సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరిన స్థానికులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని గంజిగుంటె గ్రామ పంచాయతీ హక్కి-పిక్కి కాలనీలో 50మందికిపైగా కాంగ్రెస్‌లో చేరారు. పుట్టు అంజినప్ప నాయకత్వంలో స్థానికులు కాంగ్రెస్ తీర్థం స్వీకరించారు. ఈ సందర్భంగా అంజినప్ప మాట్లాడుతూ ప్రజలు తనపై అభిమానంతో కాంగ్రెస్‌లో చేరడం సంతోషంగా ఉందన్నారు. గత 12ఏళ్లుగా తాలూకాలో సామాజిక సేవలు చేస్తున్నా అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నానని మీ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ మాజీ సభ్యులు వసంతచారి, ముఖ్యులు రాజకుమార్, మునివెంకటప్ప, రామాంజి, ఆనెమడుగు ఆనంద్, హాడుగొల్లపల్లి నారాయణరెడ్డి, క్యాసగెరె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కౌమారి అలంకరణలో వీవీపురంలోని శారదామాత



గంగావతరణ అలంకరణలో దొడ్డజాల ముత్యాలమ్మదేవి

## కురుబలను ఎస్టీలో చేర్చవద్దు



ఆందోళన చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

కంప్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కురుబలను ఎస్టీలో చేర్చవద్దని పట్టణంలో నిరసనలు చేపట్టారు. వాల్మీకి సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం సమాజం అధ్యక్షుడు నీరుగంటి వీరేష్, నారాయణప్ప మాట్లాడుతూ వాల్మీకి సమాజానికి రిజర్వేషన్ ఏడు శాతం మాత్రమే ఉందని, అందులోనే కురుబలను చేరిస్తే అన్యాయమైపోతామన్నారు. ఉపాధ్యక్షులు ఈరణ్ణ, వెంకటేష్ బర్మక్క, రామాంజనేయులు, గోవిందు, లక్ష్మణ్ణ, అంబన్న, వెంకటేష్, రామాంజిని, నాగభూషణ, వీరేష్, మాంతేష్, లింగప్ప, బసవరాజు, రాఘవేంద్ర, రామచంద్రప్ప, సుధాకర్, శేఖర్, నాగరాజు, ఆది, సమాజ పదాధికారులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంట ధ్వంసం



ఎలుగుబంట్ల దాడిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంట

కంప్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూడ్లిగి తాలుకాలోని నాగర హస్సేన్ గ్రామానికి చెందిన రైతు గౌడ్రు మంజన్న పొలంలో ఎలుగుబంటి దాడి చేసి ఎకరానికి పైగా మొక్కజొన్న పంటను ధ్వంసం చేసింది. గుడేకోట ప్రాంతంలో ఎలుగుబంట్ల సంఖ్య ఎక్కువ కావడంతో మొక్కజొన్న పంటలు పూర్తిగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవి జంతువుల నుంచి పంటలను కాపాడాలని అటవీ అధికారులకు విన్నవించినా స్పందించడం లేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

## రోడ్ల కోసం రూ. 90 కోట్లు ఇవ్వండి

- మంత్రులను కోరిన ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం/ క్రైం, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ. 90 కోట్లు నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం గురువారం ఆమె మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్‌లను వారి కార్యాలయాల్లో కలిసి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. అనంతపురం బైపాస్ నుంచి కనగానపల్లి రోడ్డు, కనగానపల్లి నుంచి చిగురుచెట్టు రోడ్డు, ధర్మవరం నుంచి కళ్యాణదుర్గం వెళ్లే మార్గంలో ఉన్న రోడ్డు, పంగల్‌రోడ్డు సమీపం నుంచి చిగిచెర్లకు వెళ్లే రోడ్డు బాగా దెబ్బతిన్నాయని నిధులు మంజూరు చేయాలని రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు.